## ప్రశాంతంగా ముగిసిన గుంటూరు బార్ అసోసియేషన్ ఎన్నికలు

**గుంటూరు లీగల్,మార్చి 31,ప్రభాతవార్త :** గుంటూరు బార్ అసోసియేషన్ కు 2026-27సంవత్సరానికి మంగళవారం జరిగిన





ఎన్నికలు ప్రశాంతంగా ముగిశాయి.ఈ ఏడాది 2023మంది న్యాయవాదులు ఓటుహక్కు కలిగి ఉన్నారు.అయితే 1608మంది న్యాయవాదులు మాత్రమే ఓటుహక్కు వినియోగించుకున్నారు .ఉదయం 10గంటల నుండి ప్రారంభమైన ఎన్నికలు సాయంత్రం 4.30గంటల వరకు నిర్వహించారు.ఎన్నికల అధికారిగా ప్రస్తుత బార్ అధ్యక్షుడు యంగలశెట్టి శివ సూర్యనారాయణ వ్యవహరించారు.పోటీలో నిలిచిన అభ్యర్థులు జిల్లా ప్రధాన ద్వారం ముందునుండి భారీగా తమ ప్రచారాన్ని కొనసాగించారు. న్యాయవాదులు, గుంటూరు బార్ అసోసియేషన్ సభ్యులు కూడా అయినటువంటి ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్,జనసేన జిల్లా అధ్యక్షులు గాదె వెంకటేశ్వరరావు,రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు వట్టిజొన్నల బ్రహ్మారెడ్డి, జి.శాంతకుమార్ తదితరులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు.రాత్రి 9గంటలకు కౌంటింగ్ ప్రక్రియ ప్రారంభమైంది.ఎంత సమయం అయినప్పటికీ రాత్రికి ఫలితాలు వెల్లడిస్తామని సూర్యనారాయణ వెల్లడించారు.

## సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ అంగన్వాడీలు హెల్పర్స్ నిరసన

**పెదనందిపాడు, మార్చి 31, (ప్రభాతవార్త) :** అనేక సంవత్సరాలుగా వివిధ రూపాలలో ఆందోళనకార్యక్రమాలు నిర్వహించినప్పటికీ. నేటి వరకు అంగన్వాడీల సమస్యలు పరిష్కారం కాలేదని ,వారి పట్ల ప్రభుత్వాలు నిరక్ష్య వైఖరి వహిస్తున్నాయని సి.ఐ.టి.యు. మండల నాయకులుదొప్పలపూడి రమేష్ బాబు ఆగ్రహం వ్యక్తం చేశారు.వెంటనే అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.మంగళవారం పెదనందిపాడు తహసిల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు .కనీస వేతనం 26 వేలు రూపాయలు ఇవ్వాలని, గ్యాస్ సిలిండర్ ప్రభుత్వమే అందించాలని ,ప్రతినెల జీతాలు ఒకటవ తేదీనే చెల్లించాలని ప్రభుత్వాన్ని కోరారు.అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ మండల కార్యదర్శి శివ పార్వతి మాట్లాడుతూ మెనూ బిల్లులు పెంచాలని, ఏ నెలకి ఆ నెల క్రమం తప్పకుండా బిల్లులు చెల్లించాలని ,తల్లికి వందనం అంగన్వాడీ సెంటర్లో చదువుకుంటున్న పిల్లలకు కూడా వర్తింపజేయాలని ప్రభుత్వాన్ని కోరారు .అంగన్వాడి సెంటర్లకు శాశ్వత భవనాలు ప్రభుత్వమే నిర్మించాలని కోరారు. మెనూలోని సరుకులను ప్రభుత్వమే అంగన్వాడి సెంటర్ల వద్ద వర్కర్స్ అండ్ హెల్పర్స్ కు అందజేయాలని ప్రభుత్వాన్ని కోరారు. గత ప్రభుత్వంలో 42 రోజులు చేసిన నిరసన దీక్షల సందర్భంగా నేటికూటమి ప్రభుత్వం నాయకులు టెంట్ల వద్దకు వచ్చి, మా ప్రభుత్వం అధికారంలోనికి వచ్చిన వెంటనే, మీ సమస్యలను పరిష్కరిస్తామని ,జీతాలు పెంచుతామని హామీ ఇచ్చి, అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు అయినప్పటికీ, ఒక్క సమస్య కూడా పరిష్కరించలేదని,ఒక్క రూపాయి కూడా పెంచలేదని, అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ పట్ల నిరక్ష వైఖరి వహిస్తున్నారని అన్నారు. ఈరోజు సమస్యల పరిష్కారం కొరకు రాష్ట్ర వ్యాపితంగా



మండల కార్యాలయాల వద్ద నిరసన తెలియజేయడం జరుగుతుందని, అందులో భాగంగా పెదనందిపాడు మండల తాసిల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలియ చెల్లిస్తున్నామని అన్నారు. అనంతరం తహసిల్దార్ హేనాప్రియ కు వినతి పత్రం అందించారు.ఈ కార్యక్రమంలోపివెంకమ్మ. కే పద్మావతి ,సి.హెచ్. అనిత, జె.శ్రీదేవి, జి .సామ్రాజ్యం ,ఆర్ పుష్పలత ,ఎస్ సునీత,ఎన్ దుర్గ భవాని తదితరులు పాల్గొన్నారు.

## కిట్స్‌లో ఉల్లాసంగా క్రీడా,సాంస్కృతిక కార్యక్రమాలు

**వట్టిచెరుకూరు, మార్చి 31, ప్రభాతవార్త :** మండలంలోని విజనంపాడు గ్రామ పరిధిలో ఉన్న కిట్స్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం రెండవ రోజు కిట్స్ యువ 2కె26 కార్యక్రమంలో భాగంగా క్రీడా, సాంస్కృతిక, మార్ట్, కోడింగ్ టు ప్లే తదితర అంశాలలో 2,700కు పైగా విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు. సాంస్కృతిక ప్రదర్శనలో భాగంగా సాంప్రదాయ నృత్యాలు, ఫ్లాష్ మాబ్, సింగింగ్, డ్రామా ప్రముఖ సెలబ్రిటీల ప్రదర్శనలు






సంకేతిక అంశాలు ఉల్లాసంగా కొనసాగాయని కళాశాల చైర్మన్ డాక్టర్ కోయి సుబ్బారావు తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్, సెక్రటరీ డాక్టర్ కోయి సుబ్బారావు, కోయి శేఖర్ మాట్లాడుతూ..తమ కళాశాలలో కిట్స్ యువ 2కె26 కార్యక్రమాన్ని గత నెల 30వ తేదీన ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమం గతనెల 30, 31, ఏప్రిల్ 1వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని వివరించారు. ప్రతిభ, వికాసానికి వేదికగా నిలిచే ఇలాంటి కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చూపాలని సూచించారు. క్రీడా, సాంస్కృతిక మరియు సాంకేతిక అంశాలలో జాతీయ స్థాయిలో 42 ఇంజనీరింగ్ కళాశాలల నుండి విద్యార్థులు పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారని చెప్పారు. కిట్స్ యువలో సాంకేతిక మరియు సాంస్కృతిక పోటీలు చాలా ఆసక్తికరంగా సాగాయని పేర్కొన్నారు. జాతీయస్థాయిలో పాల్గొన్న వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు తమ సాంస్కృతిక నైపుణ్యాలను ప్రదర్శించారని తెలిపారు. ఫెస్ట్ లో భాగంగా కోడింగ్ డిబగ్గింగ్, పేపర్ ప్రజెంటేషన్, ప్రాజెక్ట్ ఎక్స్ ఫో, మిమి మేకింగ్, టెడెక్స్ టాకింగ్, బిట్స్ ఆకట్టుకున్నాయి. విద్యార్థులలో దాగిఉన్న ప్రతిభను వెలికి తీయడానికి మరియు వారిలో పోటీతత్వాన్ని పెంపొందించడానికి ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని వివరించారు. క్రీడల్లో భాగంగా వాలీబాల్, బాస్కెట్ బాల్, ఇతర ఇండోర్ అవుట్ డోర్ క్రీడలు, కబడ్డీ, ఖోఖో, పోటీలు ఉత్కంఠంగా సాగాయి. ఉత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ ఉత్సవాల్లో అద్భుతమైన క్రీడా నైపుణ్యం మరియు క్రీడా స్ఫూర్తి ప్రదర్శించినందుకు ఉత్తమ క్రీడాకారుడి అవార్డు మరియు బహుమతిని కళాశాల చైర్మన్, సెక్రటరీ చేతులమీదుగా అందజేశారు. వివిధ సాంకేతిక మరియు సాంస్కృతిక పోటీలలో విజేతలుగా నిలిచిన వారికి కూడా ట్రోఫీలు, నగదు మరియు ప్రశంసా పత్రాలు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ డా.పి. బాబు, అకడమిక్ డైరెక్టర్ డా.కె.హరిబాబు, కిట్స్ యువ 2కె 26 కన్వీనర్ ప్రొఫెసర్ బసవేశ్వరరావు, కోకన్వీనర్ ఆర్. రమేష్, డాక్టర్ ఎం.పూర్ణకిషోర్, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది, వివిధ కళాశాలకు చెందిన విద్యార్థినీ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీరామ నవమి సందర్భంగా పుల్లడిగుంటలో మహా అన్నదానం

**వట్టిచెరుకూరు, మార్చి 31, ప్రభాతవార్త :** మండలంలోని పుల్లడిగుంట గ్రామంలో శ్రీరామ నవమి పండుగ సందర్భంగా ఆంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో మంగళవారం కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామస్తుల సహాయ సహకారాలతో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు కమిటీ సభ్యులు తెలియజేశారు. కార్యక్రమములో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామస్తులు మాట్లాడుతూ శ్రీరామ నవమి రోజు అన్నదాన కార్యక్రమము ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. రాములవారి దయ ప్రతిఒక్కరిపై ఉండాలని, శ్రీరాముడిని నమ్ముకున్న వారికి కొంగుబంగారమై కోరుకున్న కోరికలు నెరవేరాలని, రాముడు ప్రేమ ప్రతి కుటుంబంపై ఉండాలని, అందరూ నిండు నూరేళ్ళు అష్ట ఐశ్వర్యాలతో, ఆయురారోగ్యాలతో ఆనందంగా ఉండాలని కోరారు. గ్రామంలో ప్రతి ఏడాది శ్రీరామనవమి పండుగ సందర్భంగా దాతల సహాయ సహకారాలతో అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తుంటామని



చెప్పారు. ఈ కార్యక్రమానికి ఎక్కువ మొత్తంలో ఆర్థికంగా సహకరించిన గ్రామస్తులకు, భక్తులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఏడాది మలినేని ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినీలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనడం సంతోషంగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో గుంటుపల్లి శివరాం, ఉప్పుటూరి శ్రీనివాసరావు, యడ్లపల్లి వీరప్రసాద్, గుంటుపల్లి సదాశివరావు, మానుకొండ రాజు, ఎర్రగుంట త్యాగరాజు, ఉప్పుటూరి చిన్న అప్పారావు, మహిళలు, . తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజలకు సేవ చేయడమే లక్ష్యం : మేఘనారెడ్డి

**కొల్లిపర, మార్చి 31, ప్రభాతవార్త:** పేద ప్రజలకు సేవా కార్యక్రమాలు నిర్వహించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎంఆర్ ఫ్యూచర్ ఫౌండేషన్ ట్రస్ట్ ఛైర్మన్ కొల్లి మేఘనారెడ్డి చెప్పారు.మంగళవారం కొల్లిపర సామాజిక ఆరోగ్య కేంద్రానికి



ఎంఆర్ ఫ్యూచర్ ఫౌండేషన్ ట్రస్ట్ ద్వారా ఎన్మాక్స్ సంస్థ డైరెక్టర్ దొంతిరెడ్డి సత్యనారాయణ రెడ్డి వైద్య పరికరాలను వైద్యులకు అందజేశారు.ఈ సందర్భంగా మేఘనారెడ్డి మాట్లాడుతూ ఇసిజి మెషిన్,మల్టీపారా పేసెంట్ మానిటర్ పరికరాలను అందజేసినందున పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయన్నారు.ఎంఆర్ ఫ్యూచర్ ఫౌండేషన్ ట్రస్ట్ ద్వారా క్షయ వ్యాధి రోగులకు పౌష్టికాహారం అందజేస్తున్నట్లు వెల్లడించారు.కొల్లిపర మండలాన్ని క్షయరహిత మండలంగా తీర్చిదిద్దుతామన్నారు.మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శ్రావణి మాట్లాడుతూ దాతలు అందజేసిన వైద్య పరికరాలతో పేద ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందిస్తామని చెప్పారు.ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు మాధవిలత,సుప్రియ,నివేదిత,మణికంఠ,కావ్య,దొంతిరెడ్డి శ్రీనివాసరెడ్డి, నెర్ల కుటుంబరెడ్డి,బొంతు గోపిరెడ్డి,గుదిబండి వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సజావుగా మధ్యాహ్న భోజన పథకం అమలు చేయాలి : ఝూన్సీలత

**కొల్లిపర, మార్చి 31, ప్రభాతవార్త:** మండలంలో విద్యార్థులకు మధ్యాహ్న భోజన పథకాన్ని సజావుగా అమలు చేయాలని మండల విద్యాశాఖ అధికారిణి ఝూన్సీలత ఆదేశించారు.మంగళవారం కొల్లిపరలోని ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.విద్యార్థుల హాజరు శాతం,రికార్డులను పరిశీలించారు.మధ్యాహ్న భోజన పథకం తీరుతెన్నులపై



విద్యార్థులను ప్రశ్నించారు.ఈ సందర్భంగా ఝూన్సీలత మాట్లాడుతూ మధ్యాహ్న భోజన పథకం ఏజన్సీ నిర్వాహకులు వంట వండే విషయంలో జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.అజాగ్రత్తతో వ్యవహరిస్తే చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు.ప్రభుత్వ నిబంధనల ప్రకారం విద్యార్థులకు ఆహారాన్ని అందించాలని సూచించారు.విద్యార్థులకు క్రమ శిక్షణతో కూడిన మెరుగైన విద్యను బోధించాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపైన ఉందన్నారు.విద్యార్థుల ప్రగతి గురించి తల్లిదండ్రులకు తెలియజేయాలని ఝూన్సీలత చెప్పారు.

## చెవి ముక్కు గొంతు సమస్యలపై అవగాహన కలిగి ఉండాలి

**గుంటూరు కల్చరల్,మార్చి 31,ప్రభాతవార్త :** అవగాహన సంస్థ ఆధ్వర్యంలో చెవి ముక్కు గొంతు సమస్యలపై జరిగిన ఆరోగ్యసభలో డాక్టర్ మద్దాళి ప్రత్యూష ప్రధానవక్తగా పాల్గొని ప్రసంగించారు.ఆయా సమస్యల ప్రభావం వల్ల చెవిలో తీవ్రమైన నొప్పి,చీము కారడం,తలనొప్పి లాంటిలక్షణాలు ముక్కులో రక్తనాళాలు చిట్టి ముక్కు వెంబడి రక్తం కారడం జరుగుతుందన్నారు.ఈలాంటి సమస్య తలెత్తిన వెంటనే 48గంటల్లోపు డాక్టర్లు సంప్రదిస్తే ఇంజక్షన్ ద్వారా నయం చేయవచ్చన్నారు.నిర్లక్ష్యం చేస్తే అల్జిమర్ సమస్యలు వచ్చే ప్రమాదం ఉందన్నారు.ఆరోగ్యసభలో అవగాహన సంస్థ సభ్యులు లేవనెత్తిన చెవి ముక్కు గొంతుకు సంబంధించిన సమస్యలు లేవనెత్తిన సందేహాలను డాక్టర్ ప్రత్యూష నివృత్తి చేశారు.అనంతరం సంస్థ సభ్యులు డాక్టర్ ప్రత్యూషను ఘనంగా సత్కరించారు.

## సమాజ సేవ అభినందనీయం

### -చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగం - మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే నసీర్

**గుంటూరు, మార్చి 31,ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరూ సమాజసేవలో తమ వంతు భాగస్వాములు కావాలని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనార్టీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. మంగళవారం గుంటూరులో వివిధ కార్యక్రమాలలో ఎమ్మెల్యే నసీర్ పాల్గొన్నారు. తొలుత కోర్టు ప్రాంగణంలో జనసేన నాయకులు దార్ల మహేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మజ్జిగ పంపిణీని ఎమ్మెల్యే ప్రారంభించారు. వేసవికాలంలో మజ్జిగ, మంచి నీరు పంపిణీ చేయడం మంచి విషయమని చెప్పారు. వివిధ ప్రాంతాల నుంచి నగరానికి వచ్చే ప్రజల కోసం చలివేంద్రాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు. అనంతరం కాకాని రోడ్డులోని వాసవి కన్యకా పరమేశ్వరి కాంప్లెక్స్, సంగడిగుంటలోని రెడ్ల రామాలయం వద్ద శ్రీరామనవమి వేడుకల్లో భాగంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమంలో ఎమ్మెల్యేల పాల్గొన్నారు ఈ సందర్భంగా ఎమ్మెల్యే నసీర్ స్వయంగా అన్నదానం చేశారు. శ్రీరామచంద్రమూర్తి




పరిపాలన అన్నియుగాలకు ఆదర్శమని చెప్పారు. ఆయన ధర్మం సత్యం మార్గాన్ని అనుసరిస్తే జీవితం ఆనందకరంగా మారుతుందని పేర్కొన్నారు

## విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన తిరువల్లూరు పద్మకి పలువురి అభినందనలు

**గుంటూరు కార్పొరేషన్, మార్చి 31 (ప్రభాతవార్త):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ కార్పోరేషన్ డైరెక్టర్‌గా తిరువల్లూరు పద్మ నియమితులైనందుకు తెలుగు మహిళా నాయకురాలు లంకా మాధవి పలువురు తెలుగు పార్టీ మహిళలు హర్షం వ్యక్తం చేసారు .ఈ సందర్భంగా లంకా మాధవి మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పార్టీ కోసం శ్రమించిన నాయకురాళ్ళను గుర్తించి పదవులు ఇవ్వటం ముదావహం అని అన్నారు . భవిషత్తులో విశ్వబ్రాహ్మణ కార్పోరేషన్ డైరెక్టర్ తిరువళ్ళురు పద్మ మరిన్ని పదవులు అలంకరించాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో మహిళా నాయకురాళ్ళు కడియాల శ్రీదేవి,యార్లగడ్డ ప్రమీల, నాయకుడు శివ తదితరులు పద్మకి అభినందనలు తెలుపారు



## పదవీ విరమణ వీడ్కోలు

**గుంటూరు క్రైమ్,మార్చి31,ప్రభాతవార్త:** పోలీసు శాఖలో దశాబ్దాల పాటు నిస్వార్థ సేవలు అందించి, క్రమశిక్షణతో కూడిన విధి నిర్వహణతో ఆదర్శంగా నిలిచిన ఏఎస్ఐ ఎస్.రమ లాలాపేట పోలీస్ స్టేషన్ సిబ్బంది ఆమెకు జిల్లా పోలీసు శాఖ ఘనంగా వీడ్కోలు పలికింది. జిల్లా వకుల్ జిందల్ ఆదేశాల మేరకు, జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఆత్మీయ వీడ్కోలు సభ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన అదనపు ఎస్పీ రమణ మూర్తి పదవీ విరమణ పొందిన ఉమెన్ ఏఎస్ఐ ని శాలువాలతో సత్కరించి, ఉమెన్ ఎస్పై పూలదండ వేయగా జ్ఞాపికలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసు వృత్తి ఎంతో ఒత్తిడితో కూడుకున్నది. అటువంటి బాధ్యతాయుతమైన రంగంలో 34 ఏళ్ల నిబద్ధతతో పనిచేయడం సామాన్యమైన విషయం కాదు. ఉమ్మడి జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్లలో వీరు అందించిన సేవలు శాఖకు గర్వకారణం."

విశ్రాంత జీవితం కుటుంబ సభ్యులు కుమారులు కోడళ్ళతో కలిసి ఆరోగ్యంగా, ప్రశాంతంగా సాగాలని ఆకాంక్షించిన అదనపు ఎస్పీ, విశ్రాంత జీవితంలో కూడా జిల్లా పోలీసు శాఖ ఎల్లప్పుడూ వారికి అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.ఈ వేడుకలో ఆర్ ఐ వెల్ఫేర్ జిల్లా అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ సురేష్ బాబు,అసోసియేషన్ జిల్లా జాయింట్ సెక్రెటరీ లక్ష్మణ్ ఎస్పీకి పిఆర్వో శ్రీనివాసరావు ఉమన్ ఎస్పై ప్రమీలా,1991 బ్యాచ్ ఉమెన్ ఏఎస్పైలు,ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొని రిటైర్డ్ అధికారికి శుభాకాంక్షలు తెలియజేశారు.

## శారీరక,మానసిక దాడుల పై అవగాహన

**తాడేపల్లి,మార్చి 31,ప్రభాతవార్త :** మండల పరిధిలోని పెనుమాక గ్రామంలో గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ స్వచ్ఛంద సంస్థ వారి చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్టులో భాగంగా పెనుమాకలో ఉన్న మదర్ థెరిస్సా కిశోర బాలికల గ్రూప్ సభ్యులకు బాలికలపై జరుగుతున్న లైంగిక దాడుల నిరోధక చట్టం 2012గురించి, బాల్య వివాహాల వల్ల నష్టాల గురించి,కౌమారదశలో గర్భధారణ వల్ల కలిగే నష్టాల గురించి ప్రభుత్వ ఉచిత హెల్ప్‌లైన్ నంబర్లపై అవగాహన కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా చైల్డ్‌ప్రొటెక్షన్ ప్రాజెక్టు కోఆర్డినేటర్ సిస్టర్ విద్య మాట్లాడుతూ బాలికలపై జరిగే అఘాయిత్యాలు లైంగిక హింస,లైంగిక వేదింపులు,గృహహింస,మానవ అక్రమ రవాణా,నిర్బంధ బాల్య వివాహాలు,సైబర్ బుల్లియింగ్ వంటి అనేక రూపాల్లో దాడులు జరుగుతూనే ఉన్నాయని ఇవి బాలికల శారీరక,మానసిక ఆరోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపి,సామాజిక భద్రతకు ముప్పుగా మారుతున్నా యన్నారు.ఇలాంటి నేరాల నుండి పిల్లల రక్షణ చట్టం 2012గురించి అందరూ తెలుసుకోవాలన్నారు.ఇలాంటి ఘటనలు ఎక్కడైనా తెలిసిన వెంటనే 1098ఉచిత హెల్ప్‌లైన్ నంబర్‌కు




సమాచారం అందించాలని కోరారు.కార్యక్రమంలో చైతన్య బాలల పార్లమెంట్ అబ్దుల్ కలాం బాలల పార్లమెంట్‌కు చెందిన పిల్లలు,గుడ్ షెఫర్డ్ కాన్వెంట్ సిస్టర్స్ స్వచ్ఛంద సంస్థ సిబ్బంది అత్తోట పోతురాజు,పి.అనిల్,బి.విజయలక్ష్మి,తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయ భవిష్యత్ నిర్ణయించుకున్న ప్రముఖ వ్యాపారవేత్త మోపిదేవి



**రేపల్లె, మార్చి 31, ప్రభాతవార్త:** రేపల్లె నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఉనికి కోల్పోయే విధంగా రాజకీయ పరిస్థితులు మారుతున్నాయి.కాంగ్రెస్ పార్టీ తరపున రేపల్లె అభ్యర్థిగా పోటీ చేసి పార్టీ పరంగా చురుకుగా ప్రజా కార్యక్రమాలను నిర్వహించిన ప్రముఖ వ్యాపారవేత్త మోపిదేవి శ్రీనివాసరావు నియోజకవర్గ ఇన్‌ఛార్జి పదవికి రాజీనామా చేశారు.వాణిజ్య రంగంపైనే ప్రత్యేక దృష్టి కేంద్రీకరించారు.ఆంధ్రప్రదేశ్‌లోని పిసిసి అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా రెడ్డి విధి విధానాలు ప్రజలకు ఉపయోగపడేలా లేవని,పార్టీ అభ్యున్నతికి తీసుకుంటున్న చర్యలు సజావుగా లేవని భావించిన ప్రముఖ వ్యాపారవేత్త మోపిదేవి శ్రీనివాసరావు తన రాజీనామాకు దారితీసిన కారణాలను బహిర్గతం చేసేందుకు బుధవారం రేపల్లెలో సీనియర్ నేతలు,కార్యకర్తలు,తాజా మాజీ ప్రతినిధులతో సమావేశం ఏర్పాటు చేశారు.రాజకీయ భవిష్యత్‌ను ప్రకటించాలని నిర్ణయించారు.పూర్వం నుంచి కాంగ్రెస్‌వాదిగా ప్రజలలో చెరగని ముద్ర వేసుకున్న మోపిదేవి శ్రీనివాసరావు రేపల్లె నియోజకవర్గంలో పదవులు ఉన్నా లేకపోయినా ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్నారు.అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూనే ఉన్నారు.అధిష్టానం తీరు కాంగ్రెస్ పార్టీ మనుగడకే ప్రశ్నార్థకంగా మారిందని మోపిదేవి శ్రీనివాసరావు ఆందోళనకు గురయ్యారు.ప్రస్తుత తరుణంలో రాజకీయ పరిస్థితులను బేరీజు వేసుకున్న శ్రీనివాసరావు అందరి అభిప్రాయం మేరకు త్వరలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి సమక్షంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరాలని నిర్ణయించుకున్నారు.మోపిదేవి శ్రీనివాసరావు కారణంగా రేపల్లె నియోజకవర్గానికి సంబంధించి వైకాపాలో చేరే వారి సంఖ్య పెరిగే అవకాశాలు

## అభయాంజనేయ స్వామిని దర్శించుకున్న డాక్టర్ గోపిరెడ్డి

**నరసరావుపేట, మార్చి 31 ప్రభాతవార్త :** పట్టణంలోని రెడ్డి నగర్ లో వేంచేసియున్న శ్రీ అభయాంజనేయ స్వామి వారి దేవస్థానం 24వ తిరునాళ్ల మహోత్సవం సందర్భంగా మంగళవారం వైసీపీ పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్ గోపిరెడ్డి స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించి, తీర్థప్రసాదాలను స్వీకరించారు. కార్యక్రమంలో డాక్టర్ గోపిరెడ్డి మాట్లాడుతూ అభయాంజనేయ స్వామి ఎన్నో ఏళ్లుగా రెడ్డి నగర్ లో వేంచేసి పూజలు అందుకుంటున్నారని తెలిపారు. వార్షికోత్సవ ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించే కమిటీ సభ్యులను ఆయన అభినందించారు. రెడ్డి నగర్ తో పాటు సమీప ప్రాంతాల వారు గ్రామాల వారు తిరుణాల మహోత్సవంలో పాల్గొని విజయవంతం చేయటం సంతోషం అన్నారు. స్వామి ఆశీస్సులతో అన్ని వర్గాల ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలని డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఆకాంక్షించారు. వారి వెంట రెడ్డి నగర్ పెద్దలతో పాటు ఆలయ కమిటీ సభ్యులు, పెద్ద సంఖ్యలో వైసిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



## డాక్టర్ రామలింగారెడ్డి మ్యాక్సీవిజన్ ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన

**రొంపిచర్ల, మార్చి 31, ప్రభాతవార్త :** :స్థానిక బిసి కాలనీలోని టిటిడి కళ్యాణ మండపంలో మంగళవారం నరసరావుపేటకు చెందిన డాక్టర్ రామలింగారెడ్డి మాక్స్ విజన్ కంటి హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరమునకు విశేష స్పందన లభించింది. ఈ వైద్య శిబిరాన్ని మాజీ సర్పంచ్ పడాల చక్రారెడ్డి ప్రారంభించారు. ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ చెంచిరెడ్డి శిబిరంలో పాల్గొని 250 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. శిబిరానికి ముఖ్య అతిథులుగా హాస్పటల్ డైరెక్టర్ డాక్టర్ రామలింగారెడ్డి , డాక్టర్ శాంతి శ్రీ పాల్గొని వైద్య శిబిరానికి హాజరైన వారికి సూచనలు చేశారు.వారిలో 65 మందిని కంటి ఆపరేషన్ కేసులుగా గుర్తించి, చికిత్స నిమిత్తం నరసరావుపేటలోని డాక్టర్ రామలింగారెడ్డి మాక్స్ విజన్ కంటి హాస్పిటల్ కు తరలించారు. ఈ సందర్భంగా కంటి పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గెల్లి చెన్నారెడ్డి, కల్లి పిచ్చిరెడ్డి, కల్లి ప్రతాప్ రెడ్డి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## పట్టాభి రామునికి ప్రత్యేక పూజలు

### ఆకట్టుకున్న సాంస్కృతిక కార్యక్రమాలు

**నరసరావుపేట టౌన్, మార్చి 31 ప్రభాతవార్త :** శ్రీరామనవమి ఉత్సవాలలో భాగంగా సోమవారం సాయంత్రం స్థానిక శ్రీ పట్టాభిరామ స్వామి దేవస్థానంలో ద్వాదశ ప్రదక్షిణాలు, స్వామివారి గర్భ గుడి చుట్టూ 12 రకాల వాయిద్యాలతో 12 రకాల ప్రసాదాలు నివేదనతో అత్యంత వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తుల భజనలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా బాలికలు ప్రదర్శించిన భరతనాట్యం ఆకట్టుకుంది. కార్యక్రమాలు మాజీ మున్సిపల్ చైర్మన్, ఆలయ వంశ పారంపర్య ధర్మకర్త నాగసరపు సుబ్బరాయ గుప్తా, అనురాధ దంపతులచే అత్యంత వైభవంగా జరిగాయి. శ్రీరాముని ఆశీస్సులతో అన్ని వర్గాల ప్రజలు సుఖశాంతులతో వర్ధిల్లాలని నాగసరపు సుబ్బరాయ గుప్తా ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో భక్తులు, మహిళలు స్వామివారిని దర్శించుకుని, తీర్థ ప్రసాదములు స్వీకరించారు.



# పల్నాడు జిల్లా వార్త



## ఉచిత మొబైల్ మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించిన కలెక్టర్

**మాచర్ల, మార్చి 31 ప్రభాతవార్త:** శ్రీరామకృష్ణ సేవాసమితి ఆధ్వర్యంఒ ఏర్పాటు చేసిన ఉచిత మొబైల్ మజ్జిగ చలివేంద్రాన్ని పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా మంగళవారం ప్రారంభించారు. ముందుగా స్వామి వివేకానంద సేవాసమితి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కార్యక్రమాలను గోవిందరెడ్డి కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా గోవిందరెడ్డి మాట్లాడుతూ మానవసేవయే మాధవసేవ అన్న స్వామి వివేకానంద స్ఫూర్తితో గత 25 ఏళ్లుగా వేసవిలో



చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం ఉచిత మొబైల్ మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు ఈ విధంగా ఉచిత మొబైల్ మజ్జిగ చలివేంద్రాన్ని ప్రారంభించిన సేవాసమితి అధ్యక్షులు మెట్టు గోవిందరెడ్డిని అభినందించారు. చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఆర్డీవో మురళీకృష్ణ, తహశీల్దారు కిరణ్‌కుమార్, కమిషనర్ వేణుబాబు, సర్వేయర్లు, ఆర్ఐలు, వీఆర్వోలు, సేవాసమితి సభ్యులు అందుగుల చంద్రయ్య, ముత్యాల పాపిరెడ్డి, పి.హరిబాబు, చెన్నకేశవరెడ్డి, లయన్స్‌క్లబ్ సెక్రటరీ మేడం పుల్లారావు, పట్టణ ప్రజలు పాల్గొన్నారు.

## మిర్యాలలో కార్డెన్ సెర్చ్

**కారంపూడి, మార్చి 31 ప్రభాతవార్త:**
మండల పరిధిలోని మిర్యాల గ్రామంలో డీఎస్పీ వెంకటరమణ ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ మంగళవారం నిర్వహించారు. పల్నాడు జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు కార్డెన్ సెర్చ్ నిర్వహించినట్లు





డీఎస్పీ పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో సరైన పత్రాలు లేని 30 ద్విచక్రవాహనాలు, కొన్ని మారణాయుధాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గ్రామాల్లో వివాదాలకు తావు లేకుండా అన్నదమ్ముల్లా కలిసిమెలసి ఉండాలన్నారు. గ్రామాల్లో నేరాలను పూర్తిగా అరికట్టాలని సూచించారు. డ్రగ్స్‌కు బానిసై తమ జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. గ్రామాల్లో ఏవైనా అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని తెలిస్తే వెంటనే స్థానిక పోలీసులకు తెలిపాలన్నారు. కార్యక్రమంలో కారంపూడి సర్కిల్ సీఐ శరత్, ఎస్సై వాసు పర్యవేక్షణలో 42 మంది పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ఏపీ రైతుసంఘం నియోజకవర్గ కమిటీ ఎంపిక

**కారంపూడి, మార్చి 31 ప్రభాతవార్త:** ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మాచర్ల నియోజకవర్గ మహాసభ సోమవారం కారంపూడిలో జరిగింది. సభకు సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఎ.మారుతిప్రసాద్, రైతు సంఘం పల్నాడు జిల్లా కార్యదర్శి ఉలవలపూడి రాము, సీపీఐ మాచర్ల ఏరియా కార్యదర్శి మేకపోతు శ్రీనివాసరెడ్డిలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం మాచర్ల నియోజకవర్గ కమిటీని ఎన్నుకున్నారు. రైతు సంఘం ఏరియా కార్యదర్శిగా మేకపోతు చిన్న కోటిరెడ్డి, రైతు సంఘం నియోజకవర్గ అధ్యక్షులుగా గాలం శ్రీనివాసరావులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులుగా చేవూరి వీరబ్రహ్మాచారి, సీహెచ్ నాగేశ్వరరావు, ఎం.దావీదు, కె.లచ్చిరెడ్డి, ముళ్ల పాపయ్య, మామిడి లాజరులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కారంపూడి మండల కార్యదర్శి షేక్ సైదా, పట్టణ కార్యదర్శి సూర్య హనుమంతరావు, ఏకే నాగమణి, షేక్ సుభాని, తదితరులు పాల్గొన్నారు.





## నరసరావుపేటలో ఘోర రోడ్డు ప్రమాదం

### ప్రమాదంలో ఒకరి మృతి, మరొకరి పరిస్థితి విషయం

### పోలీసుల అదుపులో లారీ డ్రైవర్, కేసు నమోదు

**నరసరావుపేట క్రైమ్, మార్చి 31 ప్రభాతవార్త :** నరసరావుపేట జొన్నలగడ్డ మధ్యనున్న గుంటూరు కర్నూల్ హైవేపై మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఓ లారీ ఓవర్ టేక్ చేయబోతూ ద్విచక్ర వాహనాన్ని ఢీ కొట్టింది. ఈ ఘటనలో ద్విచక్రవాహనంపై నున్న చట్ల పార్వతి (46) అనే మహిళ లారీ కిందపడి అక్కడికక్కడే మృతి చెందగా, మృతురాలి కోడలు చట్ల నందిని సైతం లారీ కింద పడి తీవ్రంగా



గాయపడింది. ఆమె పరిస్థితి ప్రస్తుతం విషమంగా ఉంది. మృతురాలు పార్వతి ద్విచక్రవాహనం నడుపుతున్న చట్ల మస్తాన్ రావు తల్లిగా పోలీసులు గుర్తించారు. క్షతగాత్రురాలు చట్ల నందిని, మస్తాన్ రావు భార్య. ప్రమాదానికి గురైన ద్విచక్ర వాహన దారులది ఫిరంగిపురం మండలం మునగపాడు గ్రామంగా గుర్తించారు. బాధితుడు చట్ల మస్తాన్ రావు తెలిపిన వివరాల ప్రకారం బ్యాంక్ పనిపై కొడుకు, తల్లి, అతని భార్య ముగ్గురు కలిసి ద్విచక్రవాహనంపై నరసరావుపేటకు వచ్చి, పని ముగించుకుని తిరిగి వారి స్వగ్రామమైన మునగపాడు గ్రామానికి వెళ్తుండగా ప్రమాదం జరిగిందన్నారు. ప్రమాదానికి కారణమైన లారీ వినుకొండ నుండి ఏలూరుకు మొక్కజొన్న లోడుతో వెళ్తుంది. ప్రమాదానికి కారణమైన లారీడ్రైవర్ మద్యం సేవించి వున్నట్లుగా అనుమానిస్తున్నారు. సమాచారం మేరకు నరసరావుపేట గ్రామీణ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని విచారిస్తున్నారు. ప్రమాదానికి కారణమైన లారీడ్రైవర్ కాశీకృష్ణను నరసరావుపేట గ్రామీణ పోలీసులు అదుపులోకి తీసుకుని దర్యాప్తు చేపట్టారు.

## ఆపదలో ఉన్న ప్రతి కార్యకర్తకు అండగా ఉంటా

### శాసనసభ్యుడు యరపతినేని



**పిడుగురాళ్ల, మార్చి 31, ప్రభాతవార్త :** ఆపదలో ఉన్న ప్రతి కార్యకర్తకు అండగా ఉంటానని గురజాల శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని సాంబశివపేట గ్రామం (వీరాపురం)లో ప్రమాదవ శాత్తూ అగ్ని ప్రమాదంలో టీడీపీ కార్యకర్త తోటకూర శ్రీనివాసరావు గృహం పూర్తిగా దగ్ధమైంది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు బుధవారం గ్రామానికి చేరుకొని బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. తక్షణ అవసరాల నిమిత్తం రూ. 25 వేల ఆర్థికసాయం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే యరపతినేని మాట్లాడుతూ అండగా ఉంటానని అధైర్య పడొద్దని భరోసా కల్పించారు. అనంతరం కార్యకర్తలు రూ. 81 వేల ఆర్థికసాయాన్ని అందించారు. కష్టకాలంలో కార్యకర్తలను, ప్రజలను సొంత మనుషుల్లా ఆదుకునే ఎమ్మెల్యే యరపతినేని ఉదారతపై ప్రజలు ప్రశంసలు కురిపిస్తున్నారు.

## ప్రతి కార్యకర్తను ఆదుకుంటాం

### శాసనసభ్యుడు యరపతినేని

**పిడుగురాళ్ల, మార్చి 31 ప్రభాతవార్త :** తెలుగుదేశం పార్టీ జెండా మోసిన ప్రతి కార్యకర్తను ఆపదలో పార్టీ ఆదుకుంటుందని గురజాల శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు అన్నారు. దాచేపల్లి మండలం మాదినపాడు గ్రామానికి చెందిన గాజుల వీరాంజనేయులు, మాచవరం మండలం కొత్తపాలెంకు చెందిన నల్లపోతుల శ్రీనివాసరావులు యాక్సి డెంట్స్ లో



మరణించారు. వీరు టీడీపీ సభ్యత్వ తీసుకోవడంతో పార్టీ ఇన్సూరెన్స్ రూపేణా ఒక్కొక్కరికి రూ.5 లక్షల చొప్పున మంజూరయ్యాయి. ఈ నగదును మంగళవారం ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పట్టణంలోని పార్టీ కార్యాలయంలో బాధిత కుటుంబసభ్యులకు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో ఏపార్టీకి లేని కార్యకర్త సంక్షేమ నిధి టీడీపీకి ఉందన్నారు.

## ఎమ్మెల్యే 'ప్రత్తిపాటి'ని విమర్శించే అర్హత లేదు : తెదేపా మైనారిటీ నేతలు

**చిలకలూరిపేట, మార్చి 31, ప్రభాతవార్త:** గత ప్రభుత్వ హయాంలో కొందరు అవినీతి ఉన్నతాధికారులను అడ్డు పెట్టుకుని స్వచ్ఛ ఆంధ్ర నిధులను అడ్డగోలుగా కాజేసి, పాప ప్రక్షాళన కోసం ఒక 10 మందికి సాయం చేసిన అవినీతిపరుదు అని, అటువంటి వ్యక్తికి ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావును విమర్శించే నైతిక అర్హత లేదని తెలుగుదేశం పార్టీ మైనారిటీ నేతలు దుయ్యబట్టారు. మురికిపూడి గ్రామంలో జరిగిన తిరునాళ్ళ సందర్భంగా ప్రత్తిపాటి పుల్లారావును ఉద్దేశించి పలు విమర్శలు చేయడంపై మైనారిటీ నేతలు మండిపడ్డారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ 'స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ముసుగులో నువ్వు ఈ రాష్ట్రంలో ఎన్ని వందల కోట్ల అవినీతి చేసావో, ఈ నియోజకవర్గంలో ప్రతీ ఒక్కరికీ తెలుసు' అని అన్నారు. పెద్ద, పెద్ద అవినీతి అధికారులకు బినామీగా ఉండి,వాళ్ల విసిరేసిన చిల్లర సంపాదించుకున్న మీరు చిల్లర మాటలు మాట్లాడితే జరిగే పరిణామలకు మీరే బాధ్యత వహించాల్సి వస్తుందని నేతలు తెలిపారు.మూడు దశాబ్దాలుగా పేట నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి అహర్నిశం శ్రమించిన నాయకుడి పై అవాకులు, చావాకులు పేలితే నాయకుడివి అయిపోవని, అధినాయకుడి అప్పాయింట్మెంట్ కూడా దొరకని మీ లాంటి వాళ్లు గుర్తింపు కోసం ఇలా



చౌక బారు వ్యాఖ్యలు చేస్తే, మరింత దిగజారిపోవడం తప్పా, సాధించేది ఏదీ ఉండదని అన్నారు. ముందు మీరు డబ్బులు ఇవ్వాల్సిన నెల్లూరు, బీహార్‌కు చెందిన వ్యాపారస్తులకు డబ్బులు చెల్లించి, ఆ తరువాత ఏదైనా మాట్లాడాలని తెలిపారు. మరోమారు ప్రత్తిపాటి గురించి మాట్లాడితే తగిన బుద్ధి చెప్పడం తప్పదని ఈ సందర్భంగా హెచ్చరించారు. ప్రత్తిపాటి పుల్లారావుపై చేసిన వ్యాఖ్యలను వెనక్కు తీసుకుని పత్రికా ముఖంగా క్షమాపణ చెప్పాలని ఈ సందర్భంగా నేతలు డిమాండ్ చేశారు.

## ఘనంగా అంతర్జాతీయ ట్రాన్స్‌జెండర్ దినోత్సవం

**నరసరావుపేట, మార్చి 31 ప్రభావతవార్త :** హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ ఆధ్వర్యంలో ట్రాన్స్‌జెండర్ దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ, దిశా సూచనల ప్రకారం, హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ స్వచ్ఛంధ సేవా సంస్థ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన ట్రాఫిక్ సిఐ సిహెచ్.లోకనాథం మాట్లాడుతూ ఎంతో మంది కమ్యూనిటీ సభ్యులు తమ తీరు మార్చుకొని సమజం లో ఉన్నత వ్యక్తులుగా, సమాజము పై ప్రభావం చూపించే వ్యక్తులుగా ఎదగాలని కోరారు.హ్యాండ్స్ ఆఫ్ కంపాషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఆనంద్ బెంజిమెన్ కార్యక్రమానికి అధ్యక్షత వహిస్తూ ఈ దినోత్సవం యొక్క ప్రాముఖ్యతను



వివరించారు. ట్రాన్స్‌జెండర్ వ్యక్తుల విజయాలను గౌరవించడమే కాకుండా, ఈ సంవత్సరం హింస కారణంగా ప్రాణాలు కోల్పోయిన వారిని స్మరించడం కూడా ముఖ్యమని ఆయన అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న హౌస్ పట్టాలు, రేషన్, పెన్షన్ల వంటి పథకాల విషయాలను కూడా ప్రస్తావించారు. కార్యక్రమంలో ట్రాన్స్‌జెండర్ సభ్యులు పాల్గొని, అండగా ఉన్న హెచ్.ఓ.సి సంస్థకి తమ కృతజ్ఞతలు తెలిపారు. ట్రాన్స్‌జెండర్ కమ్యూనిటీ నేతలైన సౌమ్య, చాందిని తమ వ్యక్తిగత అనుభవాలను పంచుకున్నారు. వారి కుటుంబాలు, బంధువులు, సమాజం నుండి ఎదుర్కొనే వివక్ష, అవమానాలను గురించి వివరించారు. ముఖ్యంగా, కుటుంబాలు వారి ఆదాయంపై ఆధారపడినప్పటికీ,సమాజములో వారిని స్వీకరించడం లేదా గౌరవం ఇవ్వడం జరగదని చెప్పారు. కార్యక్రమంలో ట్రాన్స్ జెండర్ లు పాల్గొన్నారు.

## చెల్లని చెక్కు కేసులో ప్రభుత్వ ఉపాధ్యాయురాలికి జైలు,జరిమానా

**నరసరావుపేట క్రైమ్, మార్చి 31 ప్రభాతవార్త ::** చెల్లని చెక్కు కేసులో నేరం రుజువు అవడంతో సత్తెనపల్లి లోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఇంగ్లీష్ ఉపాధ్యాయురాలుగా సేవలందిస్తున్న ఏ గురవమ్మకు ఆరు నెలల జైలు శిక్ష, రూ 5000 జరిమానా, రూ 9 లక్షలు ఫిర్యాదుకి చెల్లించేలా స్థానిక మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి ఆవుల సలోమి మంగళవారం తీర్పు వెలువరించారు. గురవమ్మ 2019 సెప్టెంబర్ 14 న గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడు గ్రామానికి చెందిన ప్రతిపాటి రక్షణ లత వద్ద రూ ఆరు లక్షలు అప్పుగా తీసుకున్నారు . ప్రామిసరీ నోటు రాసి ఇచ్చారు. చెల్లింపులో భాగంగా 2021 నవంబర్ 8న 9 లక్షల కు గురవమ్మ రక్షణలత కు చెక్కు ఇచ్చారు. సదరు చెక్కును రక్షణ లత తన బ్యాంక్ ఖాతాలో వేసుకున్నారు. అది చెల్లలేదు ఈ మేరకు ఆమె కోర్టులో కేసు దాఖలు చేసుకున్నారు.విచారణ లో నేరం రుజువు అవడంతో పై విధంగా కోర్టు తీర్పు వెలువబడింది.

## పట్టణ శివారులో గంజాయి పట్టివేత

### -పోలీసుల అదుపులో ముఠా సభ్యులు

**నరసరావుపేట క్రైమ్, మార్చి 31 ప్రభాతవార్త :** నరసరావుపేట మండలం కేసానుపల్లి గ్రామ పరిధిలో మంగళవారం పోలీసులు గంజాయి పట్టుకున్నారు. చిలకలూరిపేట రోడ్ లోని టిట్కో గృహాల వద్ద గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారంతో పోలీసులు దాడులు చేశారు. పక్కా సమాచారంతో నిర్వహించిన దాడుల్లో భారీగా గంజాయి దొరికింది. గంజాయి సరఫరాదారులను పోలీసుల అదుపులో తీసుకున్నారు.దాడుల్లో ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి కిలోన్నారా గంజాయిని స్వాధీనం,కేసు నమోదు చేసినట్లు గ్రామీణ పోలీసులు తెలిపారు.పట్టుబడిన నిందితులంతా పట్టణంలో పలు ప్రాంతాలకు చెందినవారుగా పోలీసులు గుర్తించారు.గంజాయి విక్రయిస్తున్న ముఠా వెనుక ఇంకా ఎవరెవరు ఉన్నారని పోలీసులు ఆరా తీస్తున్నారు.

## మోటార్ సైకిల్ దొంగతనాల కేసులో నిందితుల అరెస్టు

### -8 మోటార్ సైకిళ్ళు స్వాధీనం

**యడ్లపాడు, మార్చి 31, ప్రభాతవార్త :** మోటార్ సైకిల్ దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేసిన సంఘటన మంగళవారం



చోటుచేసు కుంది. సంఘటనకు సంబంధించి ఎస్సై టి శివరామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం ముద్దాయి గుడిమెట్ల సాగర్ బాబు అని ఇతనిది తాడికొండ మండలం, పాములపాడు గ్రామంకు చెందిన వ్యక్తిగా తెలిపారు. శిక్షణ డిఎస్పీ కడారి జయకృష్ణ అదేశాల మేరకు విచారణ జరుపుతుండగా యడ్లపాడు గ్రామము మరియు మండలం ఎన్ఎస్ఎల్ సమీపంలో సర్వీస్ రోడ్డు వద్దకు వెళ్ళేసరికి అక్కడ ఎపి 39 00 3500అను నెంబరు కలిగిన హోండా సిబి యూనికాన్ మోటార్ సైకిల్ పై అనుమానాస్పదంగా వెళుతూ ఉండగా అతనిని పట్టుకొని విచారించగా అతని పేరు గుడిమెట్ల సాగర్ బాబు తాడికొండ మండలం, పాములపాడు గ్రామం అని అతనిపై తాడికొండ పోలీస్ స్టేషన్ నందు రౌడీ షీట్ ఉన్నదని, అతను మోటార్ సైకిల్ దొంగతనాలు చేసి అతని ఇంటి వద్ద పెట్టినాడని, మంగళవారం కూడా దొంగతనం చేద్దామని వచ్చుచుండగా అతనిని పట్టుకొని అతని వద్ద నుండి మండలం పరిధిలోని కారుచోల గ్రామంలో డాబా ఇంటి వద్ద ఉంచిన ఎపి 39 00 3500 అను నంబర్ కలిగిన హోండా సిబి యూనికాన్ మోటార్ సైకిల్‌ను, మండలం పరిధిలోని బోయపాలెం గ్రామం ఎన్టీఆర్ బొమ్మ ప్రక్కన ఎపి 39 కెఎల్ 5637 అను నంబర్ కలిగిన హీరో హెచ్ఎఫ్ డీలక్స్ మోటార్ సైకిల్‌ను, గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలం చిలువూరు గ్రామంలో ఎపి 07బిపి 4864 అను నంబరు కలిగిన హోండా యూనికాన్ మోటార్ సైకిల్‌ను, ఫిరంగిపురం మండలం 113 తాళ్లూరు గ్రామంలో ఎపి 40బిఎమ్ 7594 హోండా షైన్ మోటార్ సైకిల్‌ను, పల్నాడు జిల్లా నరసరావుపేట మండలం బసికాపురం గ్రామంలో ఎపి 07డిటి 7229 అను నంబర్ కలిగిన హోండా సిబి యూనికాన్ మోటార్ సైకిల్‌ను, పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణంలో ఎపి 39 ఎమ్‌సీ 4660 అను నంబర్ కలిగిన టివిఎస్ యక్స్ఎల్ మోటార్ సైకిల్‌ను, గుంటూరు జిల్లా తెనాలి రూరల్ మండలం నందివేలుగు గ్రామం రైల్వే ఫ్లవర్ బ్రిడ్జి దగ్గర ఎపి 07 బిఎన్ 0820 అను నంబరు కలిగిన హీరో హోండా స్పెండర్ ప్లస్ మోటారు వాహనమును తాడికొండ మండలము పాములపాడు గ్రామములోని ముద్దాయి అయిన గుడిమెట్ల సాగర్ బాబు ఇంటి వద్ద స్వాధీన పరచుకుని అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపడమైనదన్నారు. రికవరీ చేసిన మోటార్ సైకిల్ ల యొక్క విలువ సుమారు 3 లక్షల వరకు ఉంటుందన్నారు.

## చికిత్స పొందుతా మహిళ మృతి

**యడ్లపాడు, మార్చి 31, ప్రభాతవార్త :** మండల పరిధిలోని చెంఘీస్కాన్‌పేట గ్రామానికి చెందిన మహిళ ఆత్మహత్య చేసుకున్న పూనుకున్న సంఘటన చోటు చేసు కుంది. సంఘటనకు సంబంధించి స్థానిక ఎస్సై టి శివరామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం ఇక్కుర్తి తిరుపతమ్మ 25 సంవత్సరాలని, సుమారు మూడు సంవత్సరాల క్రితం ఆమె భర్త ఇక్కుర్తి సురేంద్ర ఆత్మహత్య చేసుకుని మరణించగా అనంతరం తిరుపతమ్మ తన ఇద్దరు ఆడపిల్లలతో కలిసి అత్తగారింట్లోనే నివసిస్తూ కూలి పనులు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తోందని, ఇటీవల జీవనోపాధి నిమిత్తం గేదెలను కొనుగోలు చేసి మేపుకొనుచుండగా, గేదెలను మేపడం మరియు ఇంటి పనులు చేయడం రెండింటినీ సమన్వయం చేసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొంటూ ఉండేదని, ఈ నేపథ్యంలో గేదెలను అమ్మివేయాలని తన అత్తగారికి తెలియజేయగా ఆమె అంగీకరించకపోవడంతో తిరుపతమ్మ తీవ్ర మనస్తాపానికి గురైనదన్నారు. ఈ క్రమంలో మనస్తాపం భరించలేక 26 తేదీ రాత్రి సుమారు 8:00 గంటల సమయంలో ఎలుకల పేస్టు సేవించి ఆత్మహత్యకు యత్నించింది. ఈ విషయాన్ని గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స చేయించారు. అనంతరం మెరుగైన వైద్యం నిమిత్తం గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, అక్కడ చికిత్స పొందుతూ తిరుపతమ్మ 30వ తేదీన సాయంత్రం సుమారు 6:30 గంటలకు మరణించటం జరిగదని, అమె కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు అదారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహించుతున్నామని తెలిపారు.



## రోడ్డు ప్రమాదంలో చికిత్స పొందుతూ వృద్ధుని మృతి

**చిలకలూరిపేట, మార్చి 31, ప్రభాతవార్త:**
చిలకలూరిపేట రూరల్ మండల పరిధిలోని పసుమర్రు గ్రామం సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వృద్ధుడు చికిత్స పొందుతూ మృతి చెందారు. కోటయ్య (70) అనే వ్యక్తి సోమవారం పసుమర్రు వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ప్రమాదం జరిగిన వెంటనే 108 సిబ్బంది అక్కడికి చేరుకుని ఆయనకు ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం గుంటూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి (జిజిహెచ్) తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ కోటయ్య పరిస్థితి విషమించడంతో సోమవారం రాత్రి ఆయన తుదిశ్వాస విడిచారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా పురుషోత్తమరావు, కార్యదర్శిగా వినయ్‌కుమార్ విజయం

**చిలకలూరిపేట, మార్చి 31, ప్రభాతవార్త:** పట్టణంలోని ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కోర్ట్ (జూనియర్ డివిజన్) చిలకలూరిపేటలో బార్ అసోసియేషన్ ఎలక్షన్ కమిటీ సభ్యులు






సాప ఆదినారాయణ, మాదాసు భాను ప్రకాష్, తోట శివరామకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక బార్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నికలు అత్యంత ఉత్సాహంగా, ఉత్కంఠ భరితమైన వాతావరణంలో ముగిశాయి. బార్ అసోసియేషన్ ఎన్నికల్లో అధ్యక్షునిగా పోలూరి పురుషోత్తమరావు విజయం సాధించారు. మొత్తం 116 ఓట్లు పోల్ అవ్వగా, పురుషోత్తమ రావుకు 58 ఓట్లు లభించాయి. ఆయన తన సమీప ప్రత్యర్థి పి. శ్రీనివాసరావు 44 ఓట్లు లభించాయి.14 ఓట్ల మెజారిటీతో పురుషోత్తమరావు గెలుపొందారు. మూడో అభ్యర్థి టి. రామాంజనేయులు కు 12 ఓట్లు రాగా, రెండు ఓట్లు 'నోటా' కు పడ్డాయి. అదేవిధంగా సెక్రెటరీ పదవికి జరిగిన పోటీలో తెల్లబాటి వినయ్ కుమార్ ఏకపక్ష విజయాన్ని అందుకున్నారు. వినయ్ కుమార్‌కు 77 ఓట్లు రాగా, ఆయన ప్రత్యర్థి రాజ్‌కుమార్‌కు 39 ఓట్లు వచ్చాయి. వినయ్ కుమార్ 58 ఓట్ల భారీ మెజారిటీతో సెక్రెటరీగా ఎన్నికయ్యారు. బార్ అసోసియేషన్‌లో మొత్తం 122 ఓట్లకు గాను 116 ఓట్లు పోల్ అయ్యాయి. వైస్ ప్రెసిడెంట్ గా వీరయ్య, ట్రెజరీ శివరాం, జాయింట్ సెక్రటరీగా జైకర్, రషీద్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన చిలకలూరిపేట బార్ అసోసియేషన్ కార్యవర్గ కమిటీ తోటి న్యాయవాదులు అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు, సీనియర్ న్యాయవాదులు, న్యాయవాదులు, తదితరులు పాల్గొన్నారు.

## డాక్టరేట్ అందుకున్న ఎన్ఈసి అసిస్టెంట్ ప్రొఫెసర్ శేషుకుమార్

**నరసరావుపేట టౌన్,మార్చి 31 ప్రభాతవార్త :** స్థానిక ఎన్ఈసి కళాశాలలో ఈసిఈ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా పనిచేస్తున్న చేగు శేషుకుమార్ అన్నమలై యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ అందుకున్నారు. ఇన్స్ట్రుమెంటేషన్ విభాగంలో ఇన్వెస్టిగేషన్స్ ఆన్ కంట్రోల్ ఆఫ్ కపుల్డ్ ట్యాంక్




సిస్టంఖి అనే అంశంపై అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ టీఎస్. మురుగేష్, అన్నమలై యూనివర్సిటీ ఆధ్వర్యంలో చేసిన పరిశోధనకు గాను శేషుకుమార్ కు పిహెచ్డి అందజేశారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు, వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి, సెక్రటరీ మిట్టపల్లి రమేష్ బాబు, ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ డి. సునీల్, ఈసిఈ విభాగాదిపతి డాక్టర్ వి. వెంకటేశ్వరరావు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది శేషుకుమార్ ను అభినందించారు.

# బాపట్ల జిల్లా వార్త



## నేడు 7676 మందికి పెన్షన్లు పంపిణీ

**కర్లపాలెం, మార్చి 31, ప్రభాతవార్త:** కర్లపాలెం మండల పరిధిలో ఉన్న 20 గ్రామపంచాయతీలో రేపు ఉదయం పెన్షన్ దారులకు పెన్షన్ అందిస్తున్నామని కర్లపాలెం ఎంపీడీవో అద్దూరి శ్రీనివాసరావు అన్నారు.మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ రేపు సచివాలయం సిబ్బంది మీ ఇంటి దగ్గరికి వచ్చి ఉదయం 6 గంటలకు అల్లా అందరికీ పెన్షన్లు అందిస్తారని ఆయన తెలిపారు. ఈ పెన్షన్లు పంపిణీ చేయడానికి మండలంలో 160 మంది సచివాలయం సిబ్బంది నియమించినట్లుగా ఆయన తెలిపారు. మొత్తం 7676 పెన్షన్ దారులకు 3 ,32,30,500 కోట్లు మండలంలో పెన్షన్లు పంపిణీ జరుగుతుందని ఆయన తెలిపారు



## నేడు ఐలవరంలో ఎమ్మెల్యే పర్యటన

**భట్టిప్రోలు(రేపల్లె), మార్చి 31, ప్రభాతవార్త:** మండలంలోని ఐలవరంలో బుధవారం వేమూరు శాసనసభ్యుడు నక్కా ఆనందబాబు పర్యటిస్తారు. ఉదయం 11.30 గంటలకు పద్మశాలీయ కళ్యాణ మండపంలో జరిగే సభలో చేనేత కుటుంబాలకు అందించే ఉచిత విద్యుత్ పథకం గురించి ప్రసంగిస్తారు. చేనేత,మరమగ్గాల కార్మిక కుటుంబాల వద్దకు వెళ్ళి సమస్యలను అడిగి తెలుసుకుంటారు.ప్రజల సంక్షేమం గురించి కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న విధానాల గురించి వివరిస్తారు.



## నిషేధిత జాబితా నుండి పట్టా భూముల తొలగింపునకు వేగంగా చర్యలు

### రెవెన్యూ అధికారులు బాధ్యతగా పని చేయాలి : కలెక్టర్

**బాపట్ల,మార్చి31, ప్రభాతవార్త** నిషేధిత భూముల జాబితా (22ఎ)లో పొరపాటున చేర్చబడిన పట్టా భూములను గుర్తించి, వాటిని వెంటనే తొలగించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వి.వినోద్ కుమార్ రెవెన్యూ అధికారులను ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లోని న్యూ వి.సి. హాల్‌లో 22ఎ నిషేధిత భూముల తొలగింపు ప్రక్రియపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ22ఎ జాబితాలో పెండింగ్‌లో ఉన్న కేసులను సత్వరమే పరిష్కరించి భూ యజమానులకు పూర్తి హక్కులు కల్పించడమే లక్ష్యంగా పనిచేయాలన్నారు. గతేడాది జూన్ నుంచి ఇప్పటివరకు జిల్లాలో 410 దరఖాస్తులు అందగా, అందులో 44 దరఖాస్తులను పరిష్కరించి ఆ భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించామన్నారు. గత ఐదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను కూడా పరిశీలిస్తున్నామని, దశలవారీగా అన్ని సమస్యలను పరిష్కరిస్తామన్నారు.ఇభూమి, వెబ్ ల్యాండ్ వంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి రెవెన్యూ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు.రెవెన్యూ అధికారులు నిబంధనల ప్రకారం బాధ్యతగా పనిచేస్తేనే సామాన్య ప్రజలకు న్యాయం జరుగుతుందన్నారు.రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు కూడా సమన్వయంతో పనిచేయాలి" అని పేర్కొన్నారు. జిల్లా స్థాయి కమిటీ వారానికి రెండు సార్లు సమావేశమై పెండింగ్‌లో ఉన్న విచారణలను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు.జిల్లా పేరు మార్పుపై సీరియస్:కొన్ని మండలాల్లో రికార్డుల్లో ఇంకా పాత జిల్లాలైన గుంటూరు, ప్రకాశం పేర్లే కొనసాగుతుండటంపై కలెక్టర్ అసహనం వ్యక్తం చేశారు. వెంటనే ఆ పేర్లను తొలగించి ఖిబాపట్ల జిల్లాఖి పేరును నమోదు చేయాలని తహశీల్దార్లను ఆదేశించారు.ఈ సమావేశంలో జిల్లా సంయుక్త కలెక్టర్ భావన వశిష్ఠ, బాపట్ల, చీరాల ఆర్డీఓలు బి.శ్రీదేవి, చంద్రశేఖర్, రిజిస్ట్రేషన్ శాఖ అధికారులు, వివిధ మండలాల తహశీల్దార్లు పాల్గొన్నారు




## అంగన్‌వాడీల వేతనాల పెంపు పై ప్రభుత్వ నిర్లక్ష్యం

### ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ బాపట్ల జిల్లా అధ్యక్షురాలు కె.ఝాన్సీ

**రేపల్లె, మార్చి 31, ప్రభాతవార్త:** రాష్ట్రంలో అంగన్‌వాడీ ఉద్యోగుల వేతనాల పెంపుదల వ్యవహారంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని ఆంధ్రప్రదేశ్ అంగన్‌వాడీ వర్కర్స్ హెల్పర్స్ యూనియన్ బాపట్ల జిల్లా అధ్యక్షురాలు కె.ఝాన్సీ ఆందోళన వ్యక్తం చేశారు.అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం రేపల్లె ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ధర్నా చేశారు.ఈ సందర్భంగా ఝాన్సీ మాట్లాడుతూ అంగన్‌వాడీల వేతనాలు పెంచమంటే రాష్ట్ర ఆర్థిక పరిస్థితి సజావుగా లేదని పేర్కొనటం సమంజసంకాదన్నారు.42 రోజుల ఆందోళన కార్యక్రమాల దరిమిలా గత ప్రభుత్వ హయాంలో ఒప్పందం చేసుకోవడం జరిగిందని ఆమె గుర్తు చేశారు.అధికారంలోకి వస్తే అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామని కూటమి పాలకులు హామీనిచ్చి అధికారంలోకి వచ్చాక స్పందించకపోవడం విచారకరమన్నారు.జీతాలు పెంచకపోగా గ్రాడ్యూటీ ప్రకటించినప్పటికీ సరైన విధానంలో లేదని ఆమె స్పష్టం చేశారు.ఉద్యోగ విరమణ చేసినా సర్వీసు మధ్యలో మృతి చెందినా వర్తించే విధంగా గ్రాడ్యూటీ విధానాన్ని అనుకూలంగా మార్చాలని సూచించారు.వేసవిని దృష్టిలో ఉంచుకుని అంగన్‌వాడీ ఉద్యోగుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని మే నెలను వేసవి సెలవుల కాలంగా ప్రకటించాలని ఝాన్సీ కోరారు.సిఐటియు బాపట్ల జిల్లా కోశాధికారి సిహెచ్.మణిలాల్ మాట్లాడుతూ వేతనాల పెంపుదల కోసం పోరాడిన అంగన్‌వాడీలపై గత ప్రభుత్వం ఎస్మా చట్టాన్ని ప్రయోగిస్తే నేటి కూటమి ప్రభుత్వం సానుభూతి వైఖరిని అవలంబిస్తూ ఆర్థిక పరిస్థితిని కారణంగా చూపుతున్నదని అన్నారు.గడచిన 22 నెలలుగా వేతనాలను పెంపుదల చేయడంలో కుంటిసాకులు చెబుతూ ప్రచారాల కోసం ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నదని ఆయన తీవ్రంగా విమర్శించారు.అనంతరం సమస్యల వినతిపత్రాన్ని సిడిపివో సుచిత్రకు అందజేశారు.ఈ ధర్నా కార్యక్రమంలో రేపల్లె ప్రాజెక్టు అధ్యక్షురాలు కె.రత్నకుమారి, కార్యదర్శి నిర్మల జ్యోతి,ఎన్.కృష్ణకుమారి,డి.జ్యోతి,జయప్రద,అమల,శారద,రాజ్యలక్ష్మి,హేమలత,అంగన్‌వాడీ వర్కర్స్,హెల్పర్స్ తదితరులు పాల్గొన్నారు.



## ఈవీఎం గోదాములకు పటిష్ట భద్రత కల్పించాలి

### రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలిసి గోదాముల తనిఖీ చేసిన కలెక్టర్

**బాపట్ల,మార్చి31,ప్రభాతవార్త:** ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎంలు), వివిప్యాట్‌ల భద్రత విషయంలో ఎలాంటి రాజీ పడకూడదని, భారత ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు అత్యంత పటిష్టమైన భద్రతను ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. మంగళవారం బాపట్లలోని ఈవీఎం, వివిప్యాట్ గోదాములను ఆయన త్రైమాసిక తనిఖీల్లో భాగంగా పరిశీలించారు.ఈ సందర్భంగా కలెక్టర్ గోదాములకు వేసిన సీల్స్, తాళాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరును, రికార్డింగ్ ఫుటేజీని స్వయంగా తనిఖీ చేశారు. భద్రతా సిబ్బంది విధులకు సంబంధించి పలు సూచనలు చేశారు. అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో గోదాములను తెరిచి, లోపల ఉన్న గదుల సీల్స్ సక్రమంగా ఉన్నాయో లేదో సరిచూశారు.ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్వో) జి.గంగాధర్ గౌడ్, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు షేక్ షఫీ పాల్గొన్నారు. వీరితో పాటు వివిధ రాజకీయ పార్టీల నాయకులుబిజెపి రామకృష్ణ,కాంగ్రెస్:ధోనేపూడి రవి,సిపిఐ: గంగయ్య,ఆమ్ ఆద్మీ: బాలాజీ రెడ్డి,బిఎస్పీ: రాజారావు మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.



## పాడిపరిశ్రమ అభివృద్ధి పై ప్రత్యేక దృష్టి : తెదేపా నేత అనగాని

**రేపల్లె, మార్చి 31, ప్రభాతవార్త:** పశువుల ఆరోగ్య సంరక్షణ, పెంపకం,పాడిపరిశ్రమ అభివృద్ధిపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి కేంద్రీకరించిందని రేపల్లె నియోజకవర్గ తెదేపా సీనియర్ నాయకుడు అనగాని శివప్రసాద్ చెప్పారు.మంగళవారం మండలంలోని పేటేరులో రేపల్లె వ్యవసాయ మార్కెట్ కమిటీ,పశుసంవర్ధక శాఖ ఆధ్వర్ యంలో ఉచిత పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి పశుగ్రాసం మెరుగుపరచడానికి,పశువుల వ్యాధి నివారణకు పాల ఉత్పాదకతను పెంచేందుకు అవసరమైన పథకాలను,వైద్య సేవలను అమలు చేసేందుకు ప్రభుత్వం శక్తి వంచనలేకుండా పనిచేస్తున్నదని తెలిపారు.పశువులకు ఉచిత వైద్య సేవలు,కృత్రిమ గర్భదారణ,వ్యాక్సినేషన్,పశుపోషణపై రైతులకు శిక్షణనివ్వడం జరుగుతుందన్నారు.ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ మత్తి అనురాధ,జనసేన పార్టీ పివోసి మత్తి భాస్కరరావు,ఎఫ్ఎసి కార్యదర్శి జి.వేణుగోపాలకృష్ణ,తెనాలి పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ బి.నాంచారయ్య,డాక్టర్ ఎ.ప్రవీణ్‌కుమార్,డాక్టర్ పి.మీనాక్షిదేవి,డాక్టర్ షేక్ కరీముల్లా,గోలి వెంకటేశ్వరరావు,డి.శాస్త్రి,కనకచర్ల కిషోర్,గోలి శేషు,ఆరేపల్లి నాగరాజు,ఎ.వీరబాబు,కోదండ రాము,దివి ధనుంజయ్,రైతులు,కూటమి పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## దళితులు పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలి

### అనుమతులు,రుణాలు ఇప్పించే బాధ్యత నాదే: కలెక్టర్ వినోద్ కుమార్

**బాపట్ల, మార్చి 31.,ప్రభాతవార్త:** అట్టడుగున ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలు ఉన్నతమైన పారిశ్రామికవేత్తలుగా ఎదగాలని, ఆ దిశగా అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి ఉత్పత్తులు, ఎగుమతుల ప్రోత్సాహక కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూవెనుకబడిన సామాజిక వర్గాల తలసరి ఆదాయం పెరిగినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమన్నారు.పరిశ్రమల స్థాపనలో భూమి లేని ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యత కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఎస్సీ సామాజిక వర్గం నుంచి ఎవరైనా పరిశ్రమలు పెట్టేందుకు ముందుకు వస్తే వారికి రుణాలు ఇప్పించే బాధ్యత నేను తీసుకుంటాన్నారు.అనుమతుల మంజూరు నుంచి పరిశ్రమ స్థాపన వరకు యంత్రాంగం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఎస్సీ జనాభా అధికంగా ఉన్న బాపట్ల జిల్లాలో ప్రభుత్వ రాయితీలు ఇతర వర్గాలకే పరిమితం కావడంపై ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు.నమోదైన 57 దరఖాస్తుల్లో 41 పరిశ్రమలకు అనుమతులు మంజూరయ్యాయి. మిగిలిన 16 పెండింగ్‌లో ఉన్నాయి.ఈ ఏడాది 118 యూనిట్ల లక్ష్యానికి గానూ, 365 దరఖాస్తులు అందాయి. ఇందులో 135 యూనిట్లకు అధికారిక అనుమతులు లభించాయన్నారు.జిల్లాలోని 88 యూనిట్లకు రూ.1.38 కోట్ల నగదు ప్రోత్సాహకాన్ని మంజూరు చేయాలని కోరుతూ సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు.



## ఖైదీలు సత్ప్రవర్తనతో మెలగాలి

### సివిల్ జడ్జి వెన్నెల

**రేపల్లె, మార్చి 31, ప్రభాతవార్త:** ఖైదీలు సత్ప్రవర్తనతో మంచివారుగా మార్పు చెందాలని రేపల్లె మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షురాలు సీనియర్ సివిల్ జడ్జి ఎస్.పి.డి.వెన్నెల అన్నారు.మంగళవారం రేపల్లె సబ్ జైలును తనిఖీ చేశారు.నిత్యావసర సరుకులు,ఖైదీలకు సిద్ధం చేసిన ఆహార పదార్థాలను పరిశీలించారు.ఖైదీల కోసం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా వెన్నెల మాట్లాడుతూ ఉచితంగా న్యాయ సహాయం పొందవచ్చని చెప్పారు.సన్మార్గంలో ముందుకు సాగితే జీవితం సుఖమయం కాగలదన్నారు. కుటుంబాల సంక్షేమం నెరవేరుతుందని ఆమె గుర్తు చేశారు.జైలులో ఖైదీల గదులు,ఆహార పదార్థాలు,పరిసరాల వ్యవహారంలో జైలు అధికారులకు తగిన సలహాలు ,సూచనలిచ్చారు.ఈ కార్యక్రమంలో జైలు,పోలీస్,కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.



## ఉపాధిహామీ పనుల పై సామాజిక తనిఖీ

**రేపల్లె, మార్చి 31, ప్రభాతవార్త:** ఉపాధి హామీ పథకం పనులలో పారదర్శకత,జవాబుదారీతనం పెంచడానికి సామాజిక తనిఖీ నిర్వహిస్తున్నామని డ్వామా పి.డి విజయలక్ష్మి అన్నారు.రేపల్లె మండలంలో 2024 ఏప్రిల్ 1వ తేదీ నుంచి 2025 మార్చి 31వ తేదీ వరకు జరిగిన ఉపాధి హామీ పనులపై మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మంగళవారం సామాజిక తనిఖీ ప్రజావేదిక కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామ సభ ద్వారా జరిగిన పనుల నాణ్యత,వ్యయం,రికార్డులను తనిఖీ చేయడం ద్వారా నిధుల దుర్వినియోగాన్ని అరికట్టవచ్చన్నారు.ఆర్థికపరంగా కూలీలకు న్యాయం జరుగుతుందని చెప్పారు.ఈ కార్య క్రమంలో డిఎల్‌పివో పద్మ,సామాజిక తనిఖీ స్టేట్ రీసోర్స్ పర్సన్ నాగరాజు,హెచ్ఆర్ మేనేజరు చంద్రశేఖర్ ,ఎంపిడివో రవిబాబు,ఎపివో సుబ్బరాజు,చక్రవర్తి,రవికుమార్,స్టాలిన్ తదితరులు పాల్గొన్నారు.




## నిబద్ధతతో కూడిన సేవలు అభినందనీయం

### -ఏఎస్సై ఎం. ముస్తఫా పదవీ విరమణ సన్మానోత్సవంలో జిల్లా ఎస్పీ

**బావట్ల.మార్చి31,ప్రభాతవార్త:** క్లిష్ట పరిస్థితుల్లోనూ నిబద్ధతతో, సమర్థవంతంగా విధులు నిర్వహించినప్పుడే పోలీస్ శాఖకు నిజమైన గుర్తింపు లభిస్తుందని బాపట్ల జిల్లా ఎస్పీ ఉమామహేశ్వర్ తెలిపారు.మంగళవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలోని వీసీ హాల్ పందు చీరాల 1టౌన్ పోలీస్ స్టేషన్ ఏఎస్సై ఎం. ముస్తఫా పదవీ విరమణ సన్మాన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. 33 ఏళ్ల సుదీర్ఘ సర్వీసు పూర్తి చేసుకున్న ముస్తఫాను, ఆయన సతీమణిని ఎస్పీ గారు పూలమాలలు వేసి, దుశ్శాలువాతో ఘనంగా సత్కరించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూగతంలో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మావోయిస్టుల కదలికలు తీవ్రంగా ఉన్న సమయంలో ప్రాణాలకు తెగించి ముస్తఫా అందించిన సేవలు ప్రశంసనీయమన్నారు. ఇతర ప్రభుత్వ ఉద్యోగాలతో పోలిస్తే పోలీస్ వృత్తి ఎంతో భిన్నమైందన్నారు.. ముస్తఫా తన వృత్తి జీవితంలో ఎదుర్కొన్న సవాళ్లను అడిగి తెలుసుకున్న ఎస్పీ పదవీ విరమణ తర్వాత ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించి కుటుంబంతో ప్రశాంతంగా గడపాలని సూచించారు. పదవీ విరమణ ప్రయోజనాలు సకాలంలో అందేలా చర్యలు తీసుకుంటామని, ఏ సమస్య ఉన్నా నేరుగా సంప్రదించవచ్చని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ ఆర్ఐ మోలుద్దీన్, ట్రాఫిక్ ఆర్ఎస్ఐ పవన్, పోలీస్ అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు



## బాపట్ల వాసికి రెడ్‌క్రాస్ జాతీయ అవార్డు

### ఉత్తమ కౌన్సిలర్‌గా శ్రీమన్నారాయణకు గుర్తింపుకలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ అభినందనలు

**బాపట్ల,మార్చి31,ప్రభాతవార్త:** ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జాతీయ స్థాయి శిక్షణ కార్యక్రమంలో బాపట్ల జిల్లాకు చెందిన పిన్నిబోయిన శ్రీమన్నారాయణ ఉత్తమ కౌన్సిలర్ అవార్డును దక్కించుకోవడం జిల్లాకే గర్వకారణమని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ కొనియాడారు. భువనేశ్వర్‌లో నిర్వహించిన అంతర్రాష్ట్ర జూనియర్ రెడ్‌క్రాస్ స్టడీ కం ట్రైనింగ్ క్యాంప్‌లో ప్రతిభ చాటిన శ్రీమన్నారాయణను మంగళవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఒరిస్సాలోని భువనేశ్వర్‌లో మార్చి 25 నుంచి 29 వరకు జరిగిన ఈ ప్రతిష్టాత్మక శిబిరంలో ఆంధ్రప్రదేశ్ బృందానికి శ్రీమన్నారాయణ కౌన్సిలర్‌గా ప్రాతినిధ్యం వహించడం విశేషమన్నారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి 200 మందికి పైగా ప్రతినిధులు హాజరయ్యారు అన్నారు.ఈ శిక్షణలో ప్రకృతి విపత్తుల నిర్వహణ, ప్రథమ చికిత్స, సైబర్ సెక్యూరిటీ, జాతీయ సమగ్రత వంటి కీలక అంశాలపై తర్ఫీదు ఇచ్చారని తెలిపారు. శిక్షణతో పాటు వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లోనూ విశేష ప్రతిభ కనబరిచిన శ్రీమన్నారాయణను ఒరిస్సా రాష్ట్ర ప్రభుత్వం ఖిఉత్తమ కౌన్సిలర్ఖి జాతీయ అవార్డుతో సత్కరించిందని కలెక్టర్ వివరించారు. బాపట్ల జిల్లాకు ఇలాంటి జాతీయ స్థాయి గుర్తింపు రావడం శుభపరిణామమని, భవిష్యత్తులో జిల్లా నుంచి మరిన్ని ప్రతిభావంతులైన అవార్డు గ్రహీతలు రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్‌క్రాస్ ఛైర్మన్ బి.ఎస్. నారాయణ భట్టు తదితరులు పాల్గొన్నారు.



## వల విసిరిన చోటే మృత్యుపాశం!

### కాలువలో చిక్కుకుని మత్స్యకారుడు మృతి

**కర్లపాలెం,మార్చి31,ప్రభాతవార్త:** చేపల వేట ఆ వ్యక్తి పాలిట మృత్యుపాశమైంది. విసిరిన వలే యమపాశమై ప్రాణాలను హరించింది. మురుగు కాలువలో చిక్కుకున్న వలను తీసే క్రమంలో నీటిలో మునిగి ఓ మత్స్యకారుడు దుర్మరణం చెందిన ఘటన కర్లపాలెం మండలంలోని ఎట్రావారిపాలెం గ్రామ పంచాయతీ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం..కర్లపాలెం లంక కాలువ ప్రాంతానికి చెందిన అద్దూరి వెంకటరావు (50) వృత్తిరీత్యా చేపల వేట సాగిస్తూ జీవనం సాగిస్తుంటాడు. ఈ క్రమంలో మంగళవారం చేపల కోసం సమీపంలోని మురుగు కాలువలోకి దిగాడు. వల విసిరిన సమయంలో అది లోపల ఉన్న రాళ్లకు బలంగా చిక్కుకుపోయింది. ఆ వలను విడిపించేందుకు వెంకటరావు నీటి అడుగుకు వెళ్లాడు. కాళ్లకు చుట్టుకున్న వల..నీటిలో చిక్కుకున్న వలను తీసే ప్రయత్నంలో ప్రమాదవశాత్తు ఆ వల తన కాళ్లకు గట్టిగా చుట్టుకుపోయింది. దీంతో ఆయన ఎంత ప్రయత్నించినా నీటిపైకి తేలలేకపోయాడు. శ్వాస అందక నీటిలోనే ఊపిరి వదిలాడు. గమనించిన స్థానికులు వెంటనే కర్లపాలెం పోలీసులకు సమాచారం అందించారు. కేసు నమోదుసమాచారం అందుకున్న కర్లపాలెం పోలీస్ రైటర్ నరేష్ ఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. స్థానికుల సాయంతో మృతదేహాన్ని బయటకు తీయించి, పంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాపట్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి కుటుంబంలో విషాద ఛాయలు అలముకున్నాయి.



## నిందితునికి 15 రోజుల రిమాండ్

**రేపల్లె, మార్చి 31, ప్రభాతవార్త:** న్యాయస్థానంలో హాజరుకాకుండా తప్పించుకుని తిరుగుతున్న ముద్దాయిని ఎట్టకేలకు పోలీసులు అదుపులోకి తీసుకుని కోర్టులో హాజరుపర్చారు.నగరం మండలంలోని కట్టవ గ్రామానికి చెందిన ఆల్తాఫ ఖాన్ క్రైమ్ నెం.59/ 2019 కేసులో కోర్టుకు హాజరుకాని కారణంగా ఎన్‌బిడబ్ల్యూ జారీ అయింది.హైద్రాబాద్‌లో ఉంటున్నట్లు సమాచారం మేరకు అక్కడకు వెళ్ళిన పోలీసులు ఆల్తాఫ ఖాన్‌ను అదుపులోకి తీసుకుని మంగళవారం రేపల్లె న్యాయస్థానంలో హాజరుపర్చారు.



## అమెరికా ప్రజలు ముక్తకంఠంతో యుద్ధాన్ని ఖండిస్తున్న తీరు చరిత్రలో నిలిచిపోతుంది

**గుంటూరు కల్చర్,మార్చి 31,ప్రభాతవార్త :** అమెరికా,ఇజ్రాయేల్ యుద్ధోన్మాదంపై రావలసిన స్పందన రావడం లేదని,అమెరికా దుష్టపోకడలను నిరసించే వారు లేకుండా పోతున్నారని,ప్రపంచ ప్రజానీకం నిర్లిప్తంగా ఉండిపోతురన్న నిరాశ ఆవరించి యున్న తరుణంలో అమెరికా వ్యాప్తంగా అక్కడున్న అన్ని వర్గాలు ఏకమై ఒకే రోజు 3,300నిరసన ప్రదర్శనలు నిర్వహించి ముక్తకంఠంతో ఇరాన్‌పై అమెరికా,ఇజ్రాయేలల్ సాగిస్తున్న యుద్ధాన్ని ఖండించిన తీరు చరిత్రలో నిలిచిపోతుందని అవగాహన సంస్థ హర్షం ప్రకటిస్తుంది.అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఇంటా,బయటా తన అరాచకంతో ప్రజాస్వామ్యానికి,మానవతకు మహాపచారం చేస్తున్నారని ప్రదర్శన కారులు మండిపడ్డారంటే ఏడాది పాలనలో వారెంత విసిగి పోయారో అర్థమవుతుందని అవగాహన సంస్థ ప్రకటిస్తుంది.

## వాహనదారులు నిబంధనలు తూచా తప్పక పాటించాలి : ఎస్ఐ

**చెరుకుపల్లి ,మార్చి 31, ప్రభాతవార్త:** వాహనదారులు అన్ని రకాల రోడ్డు ప్రయాణ నిబంధనలు తప్పక పాటించాలని ఎస్సై అనిల్ కుమార్ అన్నారు. మంగళవారం మండల కేంద్రమైన చెరుకుపల్లిలో వాహనదారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వాహన ధ్రువీకరణ పత్రాలు తప్పనిసరిగా కలిగి ఉండాలని, ముఖ్యంగా మోటార్ బైక్ నడిపే వాహనదారుడు హెల్మెట్ తప్పనిసరిగా జరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని, మితిమీరిన వేగంతో వాహనాలు నడపకూడదని ఆయన వివరించారు. వందనాలు అతిక్రమిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని ఆయన వాహనదారులకు తెలిపారు.



## సాంకేతిక మాధ్యమాల పట్ల విద్యార్థినులు అప్రమత్తంగా ఉండాలి : ఎస్సై అనిల్ కుమార్

చెరుకుపల్లి, మార్చి 31, ప్రభాతవార్త : సోషల్ మీడియా, సాంకేతిక మాధ్యమాల పట్ల విద్యార్థినులు అవగాహనతో అప్రమత్తంగా ఉండాలని ఎస్సై టి అనిల్ కుమార్ అన్నారు. మంగళవారం మండలంలోని కావూరు బాలికల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఫోన్లో వచ్చే అనవసర వాట్సాప్ ,ఇన్స్టాగ్రామ్, టిక్ టాక్ వంటి మెసేజ్ ను చూసి వ్యామోహాలతో మోసపోవద్దని సూచించారు. అపరిచిత వ్యక్తులతో పరిచయాలు మంచిది కాదని అటువంటి వ్యక్తులు ఎవరైనా ప్రలోభాలకు ప్రయత్నిస్తే తమ దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. బాల్య వివాహాల పట్ల అవగాహనతో ఉండి విద్యతో భవిష్యత్తును బంగారు బాటగా మలుచుకోవాలని ఆయన విద్యార్థినులకు సూచించారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపక సిబ్బంది, విద్యార్థినిలు పాల్గొన్నారు.



